క్లుప్తంగా

జోరందుకున్న ప్రచారం
బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ ఖాయం

అచ్చంపేట రూరల్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ సాధిస్తుందని మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్ అన్నారు. శుక్రవారం అచ్చంపేటలోని 17వ వార్డులో ఎమ్మెల్యే గువ్వల బాలరాజుకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీనివాసులు, రమేష్, నాయకులు వెంకటేష్, శ్యామ్ పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లిలో..

పెద్దకొత్తపల్లి: మండలంలోని కల్వకోలు, సాతాపూర్, జొన్నలబొగుడ, దేవల్‌తిరుమలాపూర్ గ్రామాలలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారాన్ని ముమ్మరం చేశారు. జొన్నలబొగుడ గ్రామంలో సర్పంచ్ ఇందిరా రవి నాయక్, గోపాల్, వెంకటస్వామి, సాతాపూర్‌లో గుజ్జుల పరమేశ్, కల్వకోల్ గ్రామంలో ఎంపీటీసీ వెంకటస్వామి, శ్రీనివాసులు, దేవల్ తిరుమలాపూర్‌లో ఎంపీటీసీ ప్రతాప్‌రెడ్డి, విజ్జయ్య ప్రచారం నిర్వహించారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పోతుల వెంకటేశ్వర్లు ఆధర్యంలో గ్రామానికి చెందిన పలువురు యువకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, రాజేష్, సురేందర్‌గౌడ్, మతీన్, శేషు, రమణ తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: మండలంలోని సిద్దాపూర్, పద్మారంతండా, చీన్యతండా, దాస్యతండా, జోగ్యతండా, దేవులతండా, మన్నెవారిపల్లి, మార్లపాడుతండా, ఘనపూర్, అక్కారం, బక్కలింగాయపల్లి, బొమ్మన్‌పల్లిలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు మనోహర్, మండల అధ్యక్షుడు పర్వతాలు, పీఏసీఎస్ చైర్మన్ మండడి రాజిరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, తులసీరాం, లోక్యానాయక్, సతీష్‌యాదవ్, రాజేష్ పాల్గొన్నారు.

ఒక్కసారి అవకాశం ఇవ్వండి

తాడూరు: మండల కేంద్రంలో ఎంపీటీసీ సందరేణుకతో కలిసి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రోహిణి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గ్యారంటీ పథకాలపై ఇంటింటా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శివశంకర్, నాయకులు పాల్గొన్నారు.

కొల్లాపూర్/పెంట్లవెల్లి: పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జూపల్లి కృష్ణారావుకు మద్దతుగా శుక్రవారం ఆ పార్టీ నాయకులు ప్రచారం చేశారు. స్థానిక కౌన్సిలర్లు వార్డుల్లో ప్రచారాలు నిర్వహించారు. నాయకులు ఖాదర్‌పాషా, నాగరాజు, రహీం, నయూమ్, నర్సింహ్మారావు, డాక్టర్ రాముడు తదితరులున్నారు. పెంట్లవెల్లిలో మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్ ఆధ్వర్యంలో మల్లేశ్వరం, పెంట్లవెల్లి, సింగోటం గ్రామాల్లో గడపగడప గ్యారంటీ పథకాలపై అవగాహన కల్పించారు. నర్సింహనాయుడు, ఎర్ర శ్రీనివాసులు, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గ్యారంటీ పథకాలపై అవగాహన



మన్ననూర్: అమ్రాబాద్ మండలంలోని కొత్తపల్లి, మొల్కమామిడి, మాచారం, వెంకటేశ్వర్లబావి, తుర్కపల్లి గ్రామాల్లో పార్టీ కార్యకర్తలు నాయకులతో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ వంశీకృష్ణ ఇంటింటి ప్రచారం చేశారు. గ్యారంటీ పథకాలపై అవగాహన కల్పించారు. ఎంపీపీ శ్రీనివాసులు, సర్పంచ్ కాశమ్మ, ఎంపీటీసీ పద్మ, హరినారాయణ, ఆయా గ్రామాల నాయకులు రేణయ్య, సంతోష్, అంబనారాయణ, విజయ్ పాల్గొన్నారు.

యువకులకు తీవ్రగాయాలు

అచ్చంపేట రూరల్: ప్రమాదవశాత్తు ఓ స్కూటీపై వెళ్తున్న యువకులు రోడ్డుపైకి వస్తున్న మరో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో యువకులు తీవ్రంగా గాయపడిన ఘటన శుక్రవారం మండలంలోని లింగోటం గ్రామ శివారులో చోటు చేసుకుంది. అచ్చంపేట నుంచి ఉప్పునుంతల వైపుకు స్కూటీపై వెళ్తున్న యువకులు పొలం పనులు చేసుకుని రోడ్డుపైకి వస్తున్న ఓ రైతు బైక్‌ను ఢీకొట్టారు. యువకులతో పాటు రైతుకు గాయాలయ్యాయి. ప్రచార నిమిత్తం అచ్చంపేట నుంచి ఉప్పునుంతల మీదుగా వంగూరుకు వెళ్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ వంశీకృష్ణ గమనించి యువకులకు, రైతుకు ప్రథమ చికిత్స చేశారు.

తొలిమెట్టుపై ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు శిక్షణ

కందనూలు: విద్యార్థులు తమ చదువుతోపాటు సామాజిక స్పృహ కలిగి ఉత్తమ పౌరులుగా రాణించాలని ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రామకృష్ణరావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తొలిమెట్టు కార్యక్రమంపై ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు అనేక విషయాలతో పాటు లైఫ్ స్కిల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ నెల 18 నుంచి వలంటీర్లకు కేటాయించిన పాఠశాలలో తమ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తారని పేర్కొన్నారు.

ప్రత్యేక పూజలు

మన్ననూర్: కార్తీక మాస శుక్ల పక్ష నాగుల చవితి పర్వదినాన్ని భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మన్ననూర్–అచ్చంపేట ప్రధాన రహదారిలో ఉన్న శివాలయం సమీపంలో ఉన్న పుట్ట వద్ద శివాలయంలో పూజలు చేశారు.

సంక్షేమ పథకాలు ఆదర్శం



గజమాలలో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

బిజినేపల్లి: బీఆర్‌ఎస్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తిమ్మాజీపేట మండలంలోని ఆర్‌సీతండా, ఆవంచ, బుద్ద సముద్రం కాలనీ, అమ్మపల్లి, బుద్ద సముద్రం, గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని ఓటర్లను అభ్యర్థించారు. నియోజవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి ఓటువేయాలని కోరారు. మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేయబోయే పనులపై అవగాహన కల్పించారు. సాగు, తాగునీరు, రోడ్లు, విద్యుత్ సమస్యలు లేకుండా చూశానన్నారు. స్వచ్ఛంద సంస్థ ద్వారా సామూహిక పెళ్లిలు చేశానని భవిష్యతులో పేదలకు అండగా ఉంటానన్నారు. అంతకుముందు గ్రామాల్లో ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటేయాలి

తాడూరు: బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి ఓటేయాలని సింగిల్‌విండో వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎన్నిక ప్రచారంలో భాగంగా మూడిపూరులో ఎమ్మెల్యే మర్రిజనార్దన్ రెడ్డి మద్దతుగా మహిళలతో కలిసి ఆయన ప్రచారం చేశారు. పదేళ్లుగా ఎమ్మెల్యే చేసిన అభివృద్ధిని వివరించారు. మండల కేంద్రంలో రూ.3 కోట్ల నిధులు విలువచేసే పాఠశాల భవనం, శిర్సవాడలో రూ.2 కోట్లు వెచ్చించి వెచ్చించి ఎంజేఆర్ ట్రస్ట్ ద్వార అధునాతన హంగులతో పాఠశాల భవనాలను నిర్మించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సుజాత, సోషల్‌మీడియా అధ్యక్షుడు నరేష్, రామస్వామి, భాస్కర్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

తెలకపల్లి: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి మద్దతుగా నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్, మహదేవునిపేట గ్రామాల్లో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సతీమణి మర్రి జమున గడప గడపకు ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి నాగర్‌కర్నూల్ నియోజకవర్గానికి చేసిన అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



నందివడ్డెమాన్‌లో మర్రి జమున ప్రచారం

19 ఏళ్లు అధికారంలో ఉండి ఏం చేశారు?



ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న నాగులపల్లి గ్రామస్తులు

కొల్లాపూర్/కోడేరు: 19ఏళ్లు అధికారంలో ఉండి కొల్లాపూర్ నియోజకవర్గానికి మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు ఏం చేశారో చెప్పాలని ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం కొల్లాపూర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కోడేరు మండలం నాగులపల్లి మాజీ సర్పంచ్ రాములు, సీనియర్ నాయకులు శాంతయ్య, లక్ష్మయ్యతో పాటు పలువురు ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో రఘువర్ధన్‌రెడ్డి, కిషన్‌నాయక్, రాజశేఖర్‌గౌడ్, జగన్మోహన్‌రెడ్డి, సర్పంచ్ వెంకటస్వామి, పవన్‌కుమార్‌రెడ్డి, ఆదిసోమనాథ్, కలగొండ మంగళి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కోడేరు: ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డిని రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని ఆయన సతీమణి విజయమ్మ కోరారు. మండలంలోని తీగలపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రఘువర్ధన్‌రెడ్డి, కొండ సుధాకర్‌రెడ్డి, కిషన్‌నాయక్, మండల పార్టీ అధ్యక్షులు రాజశేఖర్‌గౌడ్, సర్పంచ్ శివారెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: కొల్లాపూర్ నియోజకవర్గంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో దావాజిపల్లి, దావాజిపల్లితండా, రాయినిపల్లి, మంగళ్లపల్లికి చెందిన నాయకులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, రంగినేని అభిలాష్‌రావు, సోమనాథ్‌నాయక్, వెంకటయ్యనాయుడు పాల్గొన్నారు.

వీపనగండ్ల: సీఎం చంద్రశేఖర్‌రావు ఈ నెల 19న కొల్లాపూర్ పట్టణానికి వస్తున్న నేపథ్యంలో అన్ని గ్రామాల నుంచి కార్యకర్తలు సభకు హాజరై విజయవంతం చేయాలని గౌరారం వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, ముంత మల్లయ్య యాదవ్ కోరారు.

పెద్దకొత్తపల్లి: మండలంలోని మహాసముద్రంలో కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సంక్షేమ పథకాలపై ప్రచారం నిర్వహించారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

కందనూలు/తెలకపల్లి/తాడూరు: వచ్చే అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందని పీసీసీ వైస్ ప్రెసిడెంట్ మల్లురవి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డితో కలిసి, తెలకపల్లిలోని రాంరెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనతో తండా ప్రజలు విసుగుచెంది కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. తెలంగాణలో స్వేచ్ఛగా బతికే అవకాశం లేకుండా పోయిందని అధికార మార్పిడి కోసం ఎదురుచూస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో కూచుకుళ్ల రాజేష్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. తాడూరు మండలంలోని మండలంలోని ఇంద్రకల్, ఐతోల్, లచ్చిరాం తండాలలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సమావేశంలో పీసీసీ కార్యదర్శి రాములు, జెడ్పీటీసీ సభ్యురాలు సుమిత్ర, మాజీ ఎంపీపీ బండపర్వతాలు, సింగిల్ విండో వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు నారాయణగౌడ్, పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక పూజలు



కందనూలు: జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో ఉన్న సీతారామచంద్రస్వామి దేవాలయంలో కార్తీక మాసం నాగుల చవితిని పురస్కరించుకొని శుక్రవారం జంట నాగులకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు, అష్టోత్తర పూజలు సామూహికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామాలయ ప్రధాన అర్చకుడు కందాడై వరదరాజన్ అయ్యంగార్ మాట్లాడుతూ ఆలయంలో ప్రతిరోజు సాయంత్రం కార్తీక ఆకాశ దీపోత్సవం, సామూహిక దీపారాధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పరమశివుడికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రామాలయ కమిటీ సభ్యులు, భక్తులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

‘కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయలే’

బిజినేపల్లి/తెలకపల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2018లో రెండోసారి అధికారం చేపట్టిన నాటి నుంచి నిరుపేదలకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయలేదని కాంగ్రెస్ పార్టీ నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే అభ్యర్థి కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం మండలంలోని లట్టుపల్లితో 18 గిరిజన తండాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గిరిజనులకు పెద్దపీట వేసి వారికి రోడ్లు, విద్యుత్, ప్రత్యేక పాఠశాలలు, తాగునీరు అందించిందన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో తండాలను గ్రామ పంచాయతీలు చేసిందని కాని అభివృద్ధిని విస్మరించారన్నారు. తండాలకు నిధులు కేటాయించడంలో విఫలం అయ్యారన్నారు. తెలకపల్లితో పాటు పలు గ్రామాల్లో కూచుకుళ్ల రాజేష్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఆరు గ్యారంటీ పథకాలపై అవగాహన కల్పించారు. మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తుందని పేర్కొన్నారు. చేస్తారని అన్నారు. రఘుకుమార్, బోయ మల్ల య్య, రాజారెడ్డి, నాగరాజు, కురుమూర్తి పాల్గొన్నారు.



లట్టుపల్లి తండా ప్రజలతో కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి

వేరుశనగ పంట ధ్వంసం

పెంట్లవెల్లి: మండలంలోని గోపులాపూర్ గ్రామానికి చెందిన సురగౌని లచ్చగౌడ్ అనే రైతు గోప్లాపూర్ గ్రామంలో 4 ఎకరాల 20 కుంటల వేరుశనగ పంటను సాగు చేశాడు. రెండు రోజులుగా ఆయన పొలం దగ్గరకు వెళ్లకపోవడంతో శుక్రవారం వెళ్లి చూడగా గుర్తు తెలియని వ్యక్తులు దాదాపు రెండున్నర ఎకరాలపై వేరుశనగ పంటపై గడ్డిమందును స్ప్రే చేయడంతో పంట పూర్తిగా దెబ్బతింది. రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. దుండగులను గుర్తించి శిక్షించాలని గ్రామస్తులు కోరారు.



ఎండిన పంటను చూపుతున్న రైతు

రోడ్లపైనే మురుగు



అచ్చంపేట రూరల్: మండలంలోని సిద్దాపూర్‌లో మురుగు కాల్వలు లేక మురుగు రోడ్లపైనే ప్రవహిస్తోంది. దీంతో గ్రామస్తులు నానా అవస్థలు పడుతున్నారు. సీసీ రోడ్డు ఉన్నప్పటికీ సక్రమంగా ఏర్పాటు చేయకపోవడంతో మురుగు నిల్వ ఉంటోంది. మురుగుతో దుర్వాసనతో పాటు దోమలబెడద తీవ్రంగా ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్, కార్యదర్శి ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని, కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లడం లేదన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సారా పట్టివేత

ఉప్పునుంతల: మండలంలోని దేవదారికుంట తండాకు చెందిన రామావత్ రూప్లీ అనే మహిళ నిషేధిత సారాను తరలిస్తూ శుక్రవారం ఉదయం గుట్టమీది తండా స్టేజీ సమీపంలో పట్టుబడినట్లు ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు. ఆమె వద్ద నుంచి ఎనిమిది లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థులకు సామగ్రి పంపిణీ

తాడూరు: మండలంలోని శిర్సవాడ పాఠశాలలో శుక్రవారం క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యాసామగ్రిని క్లబ్ అధ్యక్షుడు రాఘవేందర్ అందజేశారు. ప్రముఖ క్రీడాకారులు పుల్లెల గోపీచంద్ జన్మదినాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు ఆయన జీవిత విశేషాలను తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాలలో రాణించాలన్నారు. క్లాస్‌మెట్ క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలపై రాజీలేని పోరాటం

కల్వకుర్తిరూరల్: విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్నామని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు సంతోష్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీడీఎస్‌యూ కమిటీ మెంబర్ షిప్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కాలర్‌షిప్, ఫీరీయింర్స్‌మెంట్, విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థి సమస్యలపై పోరాటం చేసే పీడీఎస్‌యూలో భాగస్వాములు కావాలని సంతోష్ కోరారు.

ఎమ్మెల్యేగా ఆశీర్వదిస్తే అండగా ఉంటా

కొల్లాపూర్/కోడేరు/వీపనగండ్ల/పెంట్లవెల్లి/పెద్దకొత్తపల్లి: ఆశీర్వదిస్తే అండగా ఉంటానని ఎమ్మెల్యే అభ్యర్థి ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. పెంట్లవెల్లి మండలం గోప్లాపూర్ గ్రామానికి చెందిన పలువురు నాయకులు శుక్రవారం ఆయన సమక్షంలో బీజేపీలో చేరారు. అనంతరం ఎల్లేని మాట్లాడుతూ మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డిలు నియోజక ప్రజలను స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకున్నారని వారు చేసిందేమీ లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కోడేరు మండలంలోని తుర్కదిన్నె, రాజాపూర్‌లో పరివర్తన యాత్రలో ఎల్లేని పాల్గొని మాట్లాడారు. ఒక్కసారి అవకాశం ఇస్తే విద్య, వైద్య, రవాణా, ఉపాధి రంగాలలో కొల్లాపూర్‌ను నంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతానన్నారు. వీపనగండ్ల మండలంలోని వల్లాభాపురం తండా, వంటిమిట్ట తండాలలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పెంట్లవెల్లిలో, జటప్రోల్ గ్రామాల్లో ఎల్లేనికి మద్దతుగా బీజేపీ, జనసేన నాయకులు ప్రచారం చేశారు. పెద్దకొత్తపల్లి ముష్టిపల్లిలో బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జలాల్ శివుడు కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎల్లేనిని ఆదరించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌యాదవ్, శేఖర్‌గౌడ్, సాయికృష్ణగౌడ్, శివకృష్ణ, మహేష్ తదితరులున్నారు.



కోడేరు మండలం రాజాపూర్‌లో మాట్లాడుతున్న ఎల్లేని సుధాకర్‌రావు

ప్రభుత్వ లెక్చరర్‌కు పీహెచ్‌డీ పట్టా



రామిశెట్టి శ్రీనివాస్

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని ప్రభుత్వ మాడల్ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న రామిశెట్టి శ్రీనివాస్ పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. శుక్రవారం కాకతీయ యూనివర్సిటీ ప్రాంగణంలో ఆయనకు అర్థశాస్త్ర విభాగంలో పీహెచ్‌డీ పట్టా అందించారు. డాక్టర్ రామిశెట్టి శ్రీనివాస్ అగ్రో ఎకనామిక్ కండీషన్స్ ఆఫ్ ట్రిబల్స్ ఇన్ ద తెలంగాణ స్టేట్ స్పెషల్ రిఫరెన్స్ యానాదీ అండ్ ఎరుకల కమ్యూనిటీ అనే అంశంపై రిటైర్డ్ ప్రొఫెసర్ రాధాకృష్ణ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసి థీసస్ సమర్పించారు. కాకతీయ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి మల్లారెడ్డి మల్లిశెట్టి శ్రీనివాస్‌కు పీహెచ్‌డీ పట్టా అందజేశారు.

అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయం



వెల్దండలో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తిరూరల్/వెల్దండ: అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం తలకొండపల్లి మండలంలోని తుమ్మలకుంట, చీపునుంతల, తడకతండా, ఆమనగల్ మండలంలోని చెట్టిపల్లి, పూనాపూర్, గౌరారం గ్రామాల్లో ఆయన విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఆరు గ్యారంటీ పథకాలపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఎమ్మెల్యేగా ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. ఆయా గ్రామాల్లో ఆయన ప్రజలు ఘన స్వాగతం పలికారు. కల్వకుర్తి మండలంలోని తాండ్ర గ్రామంలో కాంగ్రెస్ యువ నాయకుడు సాహితి ఆశాదీప్‌రెడ్డి ఎమ్మెల్సీ కసిరెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. బడుగు బలహీన వర్గాల ప్రజలను ఆదుకునే పార్టీ కాంగ్రెస్ అని ఆయన అన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, రూ.15వేల రైతుబంధు అమలు చేస్తుందన్నారు. మేనిఫెస్టోలో పొందుపర్చిన అంశాలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్నిరంగాల్లో విఫలం అయ్యిందన్నారు. ఉద్యోగాలు లేక నిరుద్యోగులు రోడ్డున పడ్డారని ఆరోపించారు. అదేవిధంగా వెల్దండ మండలంలోని కంటోనిపల్లి, రాచూర్, రాచూర్‌తండా, తిమ్మినోనిపల్లి, కొట్ర గ్రామాల్లో ఎమ్మెల్సీ ఇంటింట ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఎమ్మెల్సీ సమక్షంలో చేరారు. కండువా కప్పి ఆహ్వానించారు. చారకొండ మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన 20 మంది ముస్లిం యువకులు కాంగ్రెస్ గూటికి చేరారు. ముస్లిం సంక్షేమానికి పెద్దపీట వేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలాజీసింగ్, భూపతిరెడ్డి, సంజీవ్‌కుమార్, మట్ట వెంకటయ్యగౌడు, రషీద్, ముజ్జు, బాల్‌రాజు, రామచంద్రి, లింగం కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



కల్వకుర్తిలో రైతులతో మాట్లాడుతున్న యువ నాయకుడు ఆశాదీప్‌రెడ్డి

మహిళలు స్వయం ఉపాధితో ఎదగాలి



మాట్లాడుతున్న హకీం మురళి

కందనూలు: స్వయం ఉపాధితో మహిళలు ఎదగాలని సాయిప్రశాంతి చారిటబుల్ సేవాట్రస్ట్ అధ్యక్షుడు హకీం మురళి అన్నారు. శుక్రవారం సత్యసాయిబాబా 98వ జయంతి పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని సాయిప్రశాంతి చారిటబుల్ సేవా ట్రస్ట్, సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత టైలరింగ్, మగ్గం, పెయింటింగ్ శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మహిళలు పలు ఉపాధి రంగాలలో శిక్షణలు పొంది, నైపుణ్యం ప్రదర్శిస్తూ సామాజిక సేవలో ముందుండి, మహిళా సాధికారతను సాధించాలన్నారు. 45 రోజులపాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. స్థానికేతరులకు భోజన, నివాస వసతి కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్ హకీం విశ్వప్రసాద్, వాస ఈశ్వరయ్య, ఎలిమే ఈశ్వరయ్య, బాలకృష్ణ, ప్రధాన అర్చకులు వావిలాల రాజశేఖర్ శర్మ, రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్



పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పరిశీలిస్తున్న మిథిలీష్ మిశ్రా

నాగర్‌కర్నూల్: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను పారదర్శకంగా నిర్వహించాలని నాగర్ కర్నూల్ నియోజకవర్గం ఎన్నికల సాధారణ పరిశీలకులు మిథిలీష్ మిశ్రా అన్నారు. నాగర్‌కర్నూల్ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో కొనసాగుతున్న పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడుతూ నియోజకవర్గంలో 12డీ ద్వారా వచ్చిన 37 దరఖాస్తులకు ఇంటి వద్ద నుంచి ఓటింగ్ ప్రక్రియను వివరించారు. రిటర్నింగ్ అధికారికి సూచనలు సలహాలు అందజేశారు. 12 ద్వారా వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఆయన వెంట రిటర్నింగ్ అధికారి వెంకటరెడ్డి ఉన్నారు.

ఖోఖో కమిటీకి ఎంపిక

కందనూలు: నారాయణపేట జిల్లాలోని స్టేడియం మైదానంలో ఈనెల 9వ తేదీన ఉమ్మడి జిల్లా ఖోఖో కమిటీకి ఎంపికలు నిర్వహించారు. అండర్ 14 బాలబాలికల ఖోఖో ఎంపికల్లో జిల్లాలోని పెద్దముద్దునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి జంగా శిరీష, పల్లవి, ఎండీ షేజాద్ ఎంపికయ్యారు. ఎంపికైన వారిని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి విలియం, తెలంగాణ రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ దుమర్ల నిరంజన్, జిల్లా అధ్యక్షుడు నిరంజన్ యాదవ్, సెక్రటరీ పాండు, కోఆర్డినేటర్ కృష్ణ, ప్రసాద్ గౌడ్, మాజీ ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ వెంకటయ్య తదితరులు విద్యార్థులను అభినందించారు.

మొక్కలకు క్రమం తప్పకుండా నీరు పట్టాలి

పాన్‌గల్: హరితహారంలో నాటిన మొక్కలు ఎండిపోకుండా క్రమం తప్పకుండా నీరు పట్టాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని దొండాయిపల్లిలో రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలకు నీరు పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు, ప్రకృతి వనంలో నాటిన మొక్కలు ఎండిపోకుండా నీరు పట్టాలన్నారు. దీంతో పాటు నర్సరీలో నూతన మొక్కల కోసం కవర్లలో మట్టి నింపే విధానాన్ని ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఉపాధి పనులకు కూలీల సంఖ్యను పెంచాలని సూచించారు. విధుల నిర్వహణలో ఉపాధి సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈసీ అంజన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రదీప్‌కుమార్‌రెడ్డి, టీఏ, ఫీల్డ్ అసిస్టెంటు పాల్గొన్నారు.

మట్టి ఎంపికకు ప్రాధాన్యం

వీపనగండ్ల: గ్రామాల్లోని నర్సరీల్లో పెంచే మొక్కల పెంపకంలో మొదటగా మట్టి ఎంపికకు ప్రథమ ప్రాముఖ్యత ఇవ్వాలని ఎంపీడీఓ కతలప్ప అన్నారు. శుక్రవారం గోవల్‌దిన్నెలో వననర్సరీలతో పాటు పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూతుల్లో అన్ని వసతులను సమకూర్చాలని ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు. గ్రామంలో బడి మానివేసిన చందు, నవ్య, అనూష తల్లిదండ్రులకు పిల్లలను బడిలో చేర్పించాలని సూచించారు. పిల్లలు బడిలో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి విక్రమ్ ను ఆదేశించారు.